కీర్తిశేషులైన ఆకుండి వ్యాసమూర్తి శాస్త్రిగారు

దర్భా యజ్ఞన్న గారు, B. A. L. T.

"ఆకుండి వంశదుగ్ధాబ్ధి స భూశిరా
కాసుధాకరకీర్తి గనియె నెవఁడు
వ్యాసర్షి కృతమహాభారతామ్నాయంబు
దెలుఁగునఁ గ్రొత్తగాఁ గలిపె నెవఁడు
సరస రాజమహేంద్రవర కళాశాలఁ బ్ర
ధాన పండితుఁడు నాఁ దనరె నెవఁడు
బుధజనాహ్లాదమై పొగడొందిన యనర్ఘ
రాఘవాదుల నెన్నొ వ్రాసె నెవఁడు
శాస్త్రిగారని మేటియోజ్జలును జాల
భక్తి నిమురంద్రమ్ములఁ గొను ప్రభు వెవండు
అట్టి వ్యాసునిచారిత్ర మాంధ్ర భూమిఁ
దనరుఁ గావుత మాచంద్ర తారకముగ."

కీ. శే. ఆకుండి వ్యాసమూర్తి శాస్త్రిగారు

దక్షిణ గంగ నాఁ దగ్గరయు నొప్పిన గోదావరి యొక్క తీరదేశంబులు జగదాదినుండియుఁ బవిత్రవంతంబులై పుణ్యజనాకీర్ణంబులై, పంటపొలంబులకాకరంబులై లక్ష్మీవాణీసతుల కాటపట్టులై యేపుమీఱి యున్నవి.

గోదావరి పాయ లేడింటనొక్కటియగు వశిష్ఠకుఁ బశ్చిమతీరంబునఁ దొల్లి బ్రహ్మ మహేంద్రమహిమతో నపూర్వంబగు యజ్ఞం బొండు చేసెను. అప్పటినుండియు నత్తావు బ్రహ్మకుండంబను పవిత్రతీర్థంబై యలరుచున్నది. ఇమ్మహాపుణ్య తీర్థంబు చెంతఁ గాఁకరపఱ్ఱను గ్రామంబు గలదు. ఇది ప్రస్తుతము పశ్చిమగోదావరీ మండలములోని తణుకున కాఱు మైళ్లదూరమున నున్నది. ఇది చిరకాలమునుండియుఁ ద్రిలింగ దేశంబునం గల గొప్ప విద్యాపీఠంబులలో నొక్కటియని ప్రఖ్యాతి గాంచినది. ఇది గీర్వాణాంధ్ర భాషాయోషామణులకు నివాసంబులై, సారవంతమైన విద్వాంసుల పంటభూమియై, పరిఢవిల్లుచున్నది. ఇయ్యది 'అపార శబ్ద శాస్త్రపారగులగు వైయాకరణులకును, భారత రామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులకును, మృదుమధురరసభావభాసురనవార్థ వచనరచనా విశారదులగు మహాకవులకును, వివిధతర్కవిగాహిత సమస్తశాస్త్ర సాగరగరీయః ప్రతిభులైన తార్కికులకును,' చతుర్వేదాధ్యేతాధ్యాపక సంఘంబులకును, వధీతిబోధాచరణ ప్రచారణంబుల విద్యలకుఁ జతుర్దశత్వకల్పన చేయు పండితులకును దావలంబై యొప్పుచుండు.

ఆగ్రామంబున నారామద్రావిడకులశల్లజులగు కాఁకరపర్తి వేంకటశాస్త్రిగారుండు కాఁపురము చేయుచుండు. వీరికి రామాంబికయను ధర్మపత్ని యందు వేంకమాంబయను బాలామణి యుద్భవించె వేంకమాంబను నాయమ తల్లిదండ్రులు ఖండవల్లి గ్రామవాసియగు నాకుండి వేంకటశాస్త్రిగారి కిచ్చి వివాహము చేసిరి. వేంకటశాస్త్రి వేంకమాంబ లిద్దఱు ననుకూల దంపతులై సుఖంబుగఁ దనుయాత్ర సాగించుచుండిరి. కొంతవడికి వేంకమాంబ గర్భిణియై పురిటికిఁ బుట్టినింటికిఁ గొంపో

ఎంబడిరి. శాకరపత్రిగ్రామంబున సౌమ్యసంవత్సరము నందు (క్రీ. శ. ౧౮౬౦ ప్రాంతమున) ఒక శుభదినంబున వేంకమాంబ విబుధాధినాథుఁడగు వ్యాసమూర్తిశాస్త్రిం గనెను. కుమారసంభవంబునకుఁ జాల సంతసించుచు జాతకర్మాదిక్రియాకలాపంబులెల్ల నాకుండి వేంకటశాస్త్రి గారు కడుముచ్చటగ నిర్వర్తించిరి. ఆ బాలుఁడు శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్ధమానుఁడగుచు, సకలకళాపరిపూర్ణుఁడై, తదీక్షణ చంద్రికలచేఁ గవికులంబు నలరించుచు, ఛాత్రచకోరకంబుల వికాసభాసమానములం గావించుచుండె.

వీరికిఁ దండ్రిగారు సకాలంబున విద్యాబుద్ధులు గఱపి తగిన కట్టుబాట్లలో నుంచి పెంచిరి. ఇంట నున్నపుడే వ్యాసమూర్తిశాస్త్రిగారమరమును, నాంధ్రనామసంగ్రహమును, రఘువంశమును, భట్టికావ్యమును, నాదరాజులఘుకౌముది మున్నగు గ్రంథములను దండ్రిగారి యొద్దఁ జదివిరి. వీరికిఁ బ్రధానగురువగు వేదుల సోమనాథశాస్త్రిగారితో వీరు నాటకాలంకార సాహిత్యగ్రంథములం జదివిరి. ఆణివిళ్ల శంభుశాస్త్రిగారికడ కారికావళీ, ముక్తావళులను; నిట్టూరి సోమనాథశాస్త్రిగారి సాన్నిధ్యంబున సిద్ధాంత కౌముదీ, తత్త్వబోధినులను; అంభట్ల రామమూర్తి శాస్త్రిగారి యొద్ద నుపనిషద్భాష్యమును, బ్రహ్మసూత్రభాష్యమును, పానందలహరిని, రామానందరత్నప్రభా బ్రహ్మవిద్యాభరణాములను సంప్రదాయానుసారంబుగఁ జదివిరి. వీనికిఁ దోడుగా ఆణివిళ్ల వేంకటశాస్త్రిగారి సముఖంబునం గూర్చుండి పారాశరి, కాలామృతము, సుమానుహోళ్యగ సంవాదము మున్నగు జ్యోతిష గ్రంథముల నభ్యసించిరి. దీనం దనియక వీరు పురాణపండ భద్రయ్యశాస్త్రిగారి యొద్దఁ దెనుఁగులక్షణములు నేర్చికొని, గోవిందవఝల రాజన్నశాస్త్రిగారి సాహాయ్యంబున నాంధ్రశబ్దచింతామణిని, వృత్తరత్నాకరాది గ్రంథములను జదివిరి. దీనికిఁ దోడుగ వీరు ధృత్యున్నతోత్సాహులై, బహుళ గ్రంథావలోకనదీక్షితులై, గీర్వాణ వైకృతంబులం దసదృశపాండిత్యంబు గడించిరి. వీ రుపకారవేతనము గొనుదినముల శాకశాంచెము పూర్వ మాంగ్ల భాషాభ్యసనము చేయు నుత్సాహముతో నక్షరములను నేర్చికొనుటయే వీరి విజ్ఞాన గ్రహణాసక్తిని వేనోళ్లఁ జాటుచున్నది.

వ్యాసమూర్తి శాస్త్రులు గారు (క్రీ. శ. ౧౮౭౩ మొదలు క్రీ. శ. ౧౮౭౪ వఱకు) రెండు సంవత్సరములు తమ స్వగ్రామమునకు ఖండవల్లియం దాంధ్రోపాధ్యాయులుగ నుండి, యంత నాలుగేండ్లు (క్రీ. శ. ౧౮౭౪-౧౮౮౦) కొత్తపేటలోఁ దెలుఁగుపండితులుగఁ బని చేసిరి. అంతనుండి వారు క్రీ. శ. ౧౮౮౦ రాజమహేంద్రనగరము చేరి యందలి ప్రాథమిక పాఠశాలయందు సంస్కృతభాషాపండిత పదవిని సంపాదించి పనిచేయుచుఁ, బిమ్మట దొరతనమువారి బోధనాభ్యసన కళాశాలా సంస్కృతోపాధ్యాయ పదవి నంది, కొంతవడికి వారి కెంతయుఁ దగియున్న శాస్త్రకళాశాలా గీర్వాణభాషాపండితులై పన్నెండేండ్లు కడదాఁక నీపదవియందే యుండి యందఱు పండితుల మన్ననలకుం బాత్రులైరి.

వీరికి ఇరువదియేండ్ల ప్రాయముననే వీరి తండ్రి గారు పరలోకగతులైరి. అప్పటినుండియు సంసారము మోయు బాధ్యతయంతయు జ్యేష్ఠుఁడగు వీరిమీఁదనే పడెను. వీరు మువ్వురు సోదరులు. ఇందొక్క రిరువది నాల్గవయేఁటనే కాలధర్మము నొందిరి. గాంభీర్యవారాశియు, విశేషానుకంపాయత్తచిత్తులును, సదా సన్మార్గవర్తులును నగు వ్యాసమూర్తిశాస్త్రిగారు తమ సోదరులను గంటికి ఱెప్పవలెఁ గాచుచు, వారి కెట్టి లోపం బేని గల్గునేమో యని తమ కోర్కెలనేని బోకార్చికొని వారి వాంఛితంబులం దీర్చువారు. వీరు స్వార్జిత విత్తంబుతో సోదరులకుఁ బెండ్లి చేయించి వారి కుటుంబములను బోషించుచు, వారివారికి వలయు గృహోపకరణంబులను, ఆవాసంబులను నేర్పఱచి, వారి కెట్టిలోపంబును రాకుండ వేయి విధంబులం జూచి కాపాడువారు. వీరిభార్యకూడ వీరి యట్టి యుదారస్వాంతయే. చుట్టాల సురభియై సొబగునొందిన యీయమ తనభర్తకంటె వేయిమడుంగుల యాదరముతో మఱందులకు వలయు భోజ్యాదుల నిడి, యభ్యంగనాద్యుపచారంబులఁ సకాలంబునఁ జేయుచు వత్సలతలను రెండవతల్లివలెఁ జూచుచుండెడిది.

మనదేశమునందలి పండితులలో శాంతమూర్తులును, సౌశీల్యవంతులును, సౌజన్య విస్తారులును నగువారు పెక్కండ్రు గానరారు. ఇట్టి మహనీయగుణంబులు గల వీరికి వీరేసాటి. "నిండుకుండ తొణక" దను నుడికి లక్ష్యమగు చేర్కొన నను వైన శాంతస్వాంతులు వీరే. చాల మంది పండితులు వీరికి మిత్రులే. ఒకవేళ వీరి విద్యావైదుష్యము నెవ్వఁడేని ద్వేషించి వీరియొద్దకి వాదునకు వచ్చినచో, వాని యోరాకడను మిత్రత్వంబునన పోకార్చువారు. అనవసరంబుగఁ బండితుల వాదంబులం బ్రవేశించి కయ్యమునకుఁ గాలుద్రవ్వువారుమాత్రముగారు. తమకంటెఁ జిన్న పండితులు వీరిని దర్శింప వచ్చినను వారిని బహుభంగుల బహూకరించు వారే కాని మాత్సర్యముతోఁ గొడిమెలు కట్టువారు మాత్రము కారు.

విద్య నేర్చికొన నభిలషించు శిష్యవర్గము నెడఁ బుత్రవాత్సల్యంబు గల్గి వారేది కోరిన దానిని వారికి సుబోధమగురీతిని జెప్పువారు. అంతేవాసు లందఱు వీరి నమితగౌరవముతోఁ జూచుట కొనర్చినవి వీరి సాధువర్తన, సౌమనస్య, బోధనకౌశల్యంబులె. ఇంతియ కాక వీరు, వివేకానందస్వాముల వారివలె, బ్రహ్మజ్ఞానము నన్ని జాతులవారికి నుపదేశింప నగు ననువారైయుండు గల మహాత్ములు. వీరియొద్ద భగవద్గీతఁ జదువ నభిలాషపడిన యొక్క యంత్రిభవునితో, "వేదములను వినఁగూడని స్త్రీ శూద్ర బ్రహ్మబంధువుల కొఱకు వేదవ్యాసుఁడు భారతమును రచించెను. సనత్సుజాతీయము, విదురనీతి, భగవద్గీత, ఉత్తరగీత మున్నగునవి భారతమున నున్నవి. వీనినిగూడ శూద్రులు చదువవలెననియే వ్యాసులవారి యభిప్రాయము. ఇంతియ కాక సూతుఁడు వ్యాసమహర్షి వలన బ్రహ్మజ్ఞానమును సంపాదించి శౌనకాది మహర్షులకు బోధించె"నని యాతనికి భగవద్గీతను జెప్పిరి.

వీరికి ధనమునందును, నైహికానందములందును వైముఖ్యమెంతు. వీరి యిరుగుపొరుగుల నున్న యన్నదానమువారి కోడలు గోదావరిలో బట్టల నుతికికొనుచుండఁగా నాయమమెడలోని నాను నీటం బడి కాన్పింపలేదు. మఱునాటి యుదయమున నారేవు కడనే బట్టల నుదికికొనుచుండఁగా శాస్త్రిగారి భార్యకా నాను దొరకెను. ఆమె యద్దానిని శాస్త్రిగారి కీయ, వారు దాని నాతరుణముననే తీసుకొనిపోయి వారి కిచ్చిరి. తత్త్వజ్ఞులగు వీరికి బ్రహ్మానందమే యానందము. వీరు శేఖరాండానందంబుల గోరువారు. చిన్నతనంబున వీరికి వీథి నాటకములం జూచుటయం దభిలాషమెండుగ నుండెడిది. మిత్రుల ప్రోత్సాహంబు కారణంబుగ నొక్కనాఁడు నాటకమును జూడఁబోయి, నాటకశాలవఱకు వెళ్లి, విపరీతవైముఖ్యము నొంది, దానిఁ జూడ నిచ్చగించికొనకయే యింటికి మఱలి వచ్చిరి.

వీరికంటె నెన్నిమోరంతులు తక్కువ పాండిత్యము గలవారు చాలమంది దొరతనమువారి కున్నవరుఁ బాత్రులై వారివలన బిరుదములను బొందిరి. వీరి కీబిరుదులు లభింపమికి వీరే కారణభూతులు. కావుననే నిరాడంబరులును, సర్వతోముఖపాండిత్యాభిశోభితులును నగు వీరికి "మహామహోపాధ్యాయ" బిరుదము లభింపలేదు.

ఆపద్బాంధవుండగు నిమ్మహనీయునికి గురుభక్తి మెండు. వీరి వ్యాకరణగురువుగారు రసనాదశయం దున్నవార్త విని, వారి సమక్షంబున కేఁగి, శాంతపడి యచ్చోట నుండి, వారి యుత్తరక్రియలు చేయించి వారి కుటుంబమునకు సాధ్యమయినంత సాయము చేసి యింటికిఁ దిరిగి వచ్చిరి.

వీరు బహుళాంధ్ర గ్రంథరచనాదక్షులు. వీరు (౧) మయూరసూర్యశతకము, (౨) భామినీ విలాసము, (౩) గంగాలహరి, (౪) ఆనర్ఘరాఘవము, (౫) ప్రబోధచంద్రోదయము, (౬) పరాశరస్మృతి- యను మిశ్రాంధ్ర గ్రంథములను రచించిరి. (౭) కాళిదాసకృత ఋతుసంహారమును శుద్ధాంధ్ర గ్రంథంబుగఁ బరివర్తించిరి. (౮) భారతఫక్కి యను విమర్శగ్రంథమును గూడ వ్రాసిరి. ఇంతియ కాక వీరు (౯) భారతము నాంధ్రీకరింప మొదలిడి పదునాఁడు పర్వంబులఁ దెలిఁగించిరి. వీరు (౧౦) నైషధమును గూడ నాంధ్రభాషలో రచియింప దొరఁకొనిరి. కాని, యది పూర్తి కాకుండఁగనే వీరు పరమపదించిరి వీరిశైలి నిర్దుష్టమై, కఠినముగ నుండి నారికేళపాకమే యనిపించికొనుచున్నది. వీరి కవనమునకుఁ బాకశుద్ధియు, ధారాశుద్ధియుఁ దక్కువ. ఇందుచేతనే

యొకరు "శాస్త్రులుగారి పాకము స్వయంపాకమువలె శుచిగా నుండునే కాని రుచిగా నుండ"దని ఛలోక్తిగా ననిరట.

ఇమ్మహామహుఁడు సూత్రభాష్యములు చదివి బ్రహ్మజ్ఞానమును గూడ నార్జించిరి. ఆర్జించుటయె కాక దానిని చరమావస్థలో ననుభవమునకుఁగూడఁ దెచ్చికొనిరి. వీరు రోగపీడితులై బాధపడుచున్నపుడు వైద్యులు వచ్చి మీ కెట్లున్నదని యడిగిన "నేను హాయిగ నున్నాను, నాకు బాధలే"దనియు, బంధువు లడిగిన వారితో "నాశరీరము బాధపడుచున్నది గాని నేను బాధపడుటలేదు, విచార మన్నమాట తలపెట్టవల"దనియుఁ బలుమాఱు పలుకుచుండిరి. "ఎట్టి పండితులకైనను నిట్టి యద్వైతసిద్ధి గలుగుట యసాధారణ"మని యొక యాంధ్రపత్రికకు వ్రాసియున్నారు.

వ్యాసమూర్తిశాస్త్రిగారు క్రీ. శ. ౧౯౧౬. ఫిబ్రవరి రెండవ తేదీ పగలు పదిగంటలకు స్వర్గస్థులైరి. కర్ణకఠోరంబగు నీదుర్వార్తను బుధశిరోమణిలో కాంతరగతి విని, వాఙ్మయధురంధరులును, యశోనిలయులును నగు బ్రహ్మశ్రీ కల్లూరి వేంకటరామ శాస్త్రులుగారొక శ్లోకిని వ్రాసి తమ మనోవైకల్యానుభూతి నిట్లు ప్రకటించిరి: "ఏబుధాగ్రేసరగునకు గీర్వాణాంధ్రవాణీ దృఢాలింగన సంపత్తి బలాత్కారంబునం గాక స్వయంబుగా సంఘటిల్లినందున స్వయంభూ (బ్రహ్మ) భావంబు సమకూరెనో, యేశాంతసద్గుణగణ్యుని నా గోపాలంబును శమదమాది సంపత్తి గల ధీరశాంత పుంగవరత్నంబని పేర్కొందురో, శాస్త్రంబున 'యోగ్యులకు నేడడుగులు కూడ నడచుటచేతం గాని, యేడుమాట లాడుటచేతం గాని సిద్ధించు'నని ప్రసిద్ధిఁజెందిన నిరుపమాన 'సాప్తపదీనంబు' (సఖ్యంబు) మాకు నేకత్రనివాసంబున నేను హృద్యవర్ణ్యుతో సంవత్సరసప్తకం బవిచ్ఛిన్నంబై యలరారెనో యట్టి యాకుండి వ్యాసమూర్తి పండితబ్రహ్మవరుండు స్వర్గస్థుఁడైనందున నెంతయుఁ జింతాక్రాంతుఁడ నగుచున్నాఁడను." ఇట్టి మహామహుని కీర్తి యాచంద్రార్కమాంధ్రావని నెలకొని యుండుఁగాక.

" క. అభినవభట్టబాణుఁ డన
నర్మిలి నొక్కఁడు వన్నె కెక్కెఁ దా
నభినవదండి నాఁ బరఁగి
యద్భుతకీర్తిని గాంచె వేఱొకం
డభినవ గాథిసూనుఁ డను
నంకము దాల్చె న వొక్కఁ డీవునున్
అభినవవ్యాసమూని విరు
దాంకము దాల్పఁగదయ్య యింతటన్."

శతకమంజరి (భక్తిసంపుటము)

ఈపుస్తకంలో వృషాధిపశతకము, సర్వేశ్వరశతకము, దేవకీనందనశతకము, ఒంటిమిట్ట రఘువీరశతకము, నారాయణశతకము, కాళహస్తీశ్వరశతకము, దాశరథిశతకము, రంగశాయి శతకము, రామతారకశతకము, రామచంద్రశతకము అనే పదిశతకాలు ఉన్నవి. ఒక్కొకశతకానికి దానిని విమర్శిస్తూ ప్రకాశకులు వ్రాసిన మంచిపీఠిక ఉంది. చాలా వ్రాతప్రతులతో సరిచూచి వాటిల్లోనుంచి తీసిన పాఠాంతరాలున్ను ఎక్కించబడినవి.

మేనేజరు : ఆంధ్రగ్రంథమాల, 6-7, తంబుశెట్టివీథి, జార్జిటవున్, చెన్నపురి.